అనుకున్నదొకటి.. ఇచ్చిందొకటి

- ఉత్తమ్‌కు సివిల్ సప్లయ్ అండ్ నీటి పారుదల శాఖలు
- కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఆర్‌అండ్‌బీ, సినిమాటోగ్రఫీ
- ముందుగా ప్రచారంలో ఉన్న శాఖలు సీఎం వద్దే

నల్లగొండ ప్రతినిధి, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ) : ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి ఇద్దరూ మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న విషయం తెలిసిందే. వారిద్దరికీ శనివారం శాఖల కేటాయింపు జరిగింది. హుజూర్‌నగర్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి పౌర సరఫరాల శాఖతో పాటు నీటి పారుదల శాఖను కేటాయించారు. నల్లగొండ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి రహదారులు, భవనాల శాఖను కేటాయించారు. వాస్తవంగా వీరిద్దరిలో ఒకరికి హోంశాఖ మరొకరికి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ వస్తుందని ముందస్తు ప్రచారం జరిగింది. కానీ వీరు ఆశించిన శాఖలు గాక ఇతర శాఖల కేటాయింపు చర్చనీయాంశంగా మారింది. అయితే ఆదివారం ఉదయం 9గంటలకు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టేందుకు ముహూర్తం ఖరారైంది. దీంతో ఆదివారం నాటి వెంకట్‌రెడ్డి పర్యటన వాయిదా పడింది. కాగా జిల్లా నుంచి శాసనసభ్యులుగా గెలుపొందిన 12మంది శనివారం అసెంబ్లీలో ప్రమాణస్వీకారం చేశారు.

అసెంబ్లీలో ఎమ్మెల్యేలుగా ప్రమాణం స్వీకారం చేస్తున్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, వేముల వీరేశం, నలమాద పద్మావతి

నేనావత్ బాలూనాయక్

మందుల సామేల్

కుంభం అనిల్‌మార్‌రెడ్డి

బీర్ల అయిలయ్య

కుందూరు జయవీర్‌రెడ్డి

శాఖల కేటాయింపుల్లో మార్పు

ఈ నెల 7వ తేదీన సీఎంగా రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసిన ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి శనివారం శాఖల కేటాయింపు పూర్తైంది. ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి నీటిపారుదల, ఆహార, పౌర సరఫరాల శాఖను కేటాయించారు. కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గృహ నిర్మాణ శాఖ మంత్రిగా పనిచేసిన విషయం తెలిసిందే. ఇక కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఆర్‌అండ్‌బీ శాఖతో పాటు సినిమాటోగ్రఫీ శాఖలు కేటాయించారు. వైఎస్ హయాంలో వెంకట్‌రెడ్డికి ఐటీ, ఓడరేవుల అభివృద్ధి మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. అయితే వీరిద్దరికీ ముందుగా ఇతర శాఖలు కేటాయించనున్నట్లుగా ప్రచారం జరిగింది. ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి హోంశాఖ, వెంకట్‌రెడ్డికి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖలు దాదాపుగా ఖరారైనట్లుగా ప్రభుత్వ వర్గాల్లో చర్చ జరిగింది. వాస్తవంగా పట్టణాభివృద్ధి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖపై ఇద్దరూ ఆసక్తి చూపినట్లు తెలిసింది. అయితే వీరికి హోం, మున్సిపల్ శాఖలు కేటాయిస్తున్నట్లు ప్రచారం జరగడంతో సంబంధిత శాఖల్లోని పై స్థాయి నుంచి కింది స్థాయి వరకు అధికారులంతా వీరిని కలిసి ముందే శుభాకాంక్షలు తెలపడం గమనార్హం. కానీ అనూహ్యంగా శనివారం వీరిద్దరికీ వేరే శాఖలు కేటాయిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారం

ఉమ్మడి జిల్లా నుంచి ఎన్నికైన 12మంది ఎమ్మెల్యేలు అసెంబ్లీలో శనివారం పదవీ ప్రమాణ స్వీకారం చేపట్టారు. ప్రోటెం స్పీకర్‌గా అక్బరుద్దీన్ ఓవైసీ వ్యవహరించగా ఎమ్మెల్యేలు ప్రమాణస్వీకారం చేశారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ముందుగా ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం సూర్యాపేట నుంచి హాట్రిక్ విజయం సాధించిన బీఆర్ఎస్ మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేశారు. జిల్లా నుంచి రెండోసారి ఎన్నికైన నలమాద పద్మావతి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, నేనావత్ బాలూనాయక్, వేముల వీరేశంతో పాటు తొలిసారిగా అసెంబ్లీలో అడుగుపెట్టిన కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, బీర్ల అయిలయ్య, మందుల సామేల్, కుందూరు జయవీర్‌రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి ఎమ్మెల్యేలుగా ప్రమాణ స్వీకారం చేశారు.

నేడు కోమటిరెడ్డి బాధ్యతల స్వీకరణ

ఆర్‌అండ్‌బీ మంత్రిగా నేడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆదివారం ఉదయం 9గంటలకు సచివాలయంలోని 5వ అంతస్తులోని కార్యాలయంలో పూజ కార్యక్రమం అనంతరం అధికారికంగా బాధ్యతలు చేపట్టనున్నట్లు ఆయన కార్యాలయ వర్గాలు తెలిపాయి. బాధ్యతలు చేపట్టిన అనంతరం పలు కీలకమైన ఫైల్స్‌పై సంతకం చేయనున్నట్లు ఒక ప్రకటన విడుదల చేశారు. వాస్తవంగా మంత్రి హోదాలో ఆదివారం వెంకట్‌రెడ్డి నల్లగొండలో పర్యటించాల్సి ఉంది. కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో అనంతరం నల్లగొండ మున్సిపాలిటీలో అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహించాల్సి ఉంది. కానీ నేడు బాధ్యత స్వీకరణ నేపథ్యంలో పర్యటన వాయిదా పడింది.

గుట్టలో భక్తజన కోలాహలం

యాదగిరిగుట్ట, డిసెంబర్ 9 : కార్తీక మాసం చివరి శనివారం యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రం సందడిగా మారింది. పవిత్ర మాసం కావడంతో స్వామివారి క్షేత్రంలో దీపారాధన, వ్రతం ఆచరించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కొండకింద వ్రత మండపంలో సత్యనారాయణ స్వామి వ్రత పూజలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. 1744మంది దంపతులు వ్రత పూజల్లో పాల్గొన్నారని ఆలయాధికారులు వెల్లడించారు. ఉదయం నుంచి మహిళలు అధిక సంఖ్యలో దీపారాధనలో పాల్గొన్నారు. భక్తుల రాకతో క్యూ కాంప్లెక్స్, క్యూలైన్లు, తిరు మాఢవీధులు, గర్భాలయ ముఖ మండపంలో సందడి కనిపించింది. స్వామి వారి ప్రసాదశాల భక్తులతో కిక్కిరిసింది. కొండపైన పార్కింగ్ ప్రాంతంతో పాటు వివిధ ప్రాంతాలు వాహనాలతో రద్దీగా కనిపించాయి. స్వామి ధర్మ దర్శనానికి 3 గంటలు, వీఐపీ దర్శనానికి 2గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తులకు జరిగే సువర్ణ పుష్పార్చన, వేదాశీర్వచనంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బంగారు పుష్పాలతో ఉత్సవమూర్తిని అర్చించారు. స్వామి, అమ్మవార్ల నిత్య తిరు కల్యాణోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తెల్లవారుజామున స్వామికి సుప్రభాత సేవ, తిరువారాధన నిర్వహించి ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వామి వారికి నిజాభిషేకం, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామి వారి సహస్రనామార్చన చేపట్టారు. స్వామి, అమ్మవార్లకు ఉదయం సుదర్శన నారసింహ హోమం ఘనంగా నిర్వహించారు. సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ హోమం చేశారు. అనంతరం మొదటి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్ల నిత్య తిరు కల్యాణోత్సవం ఘనంగా జరిపించారు. సాయంత్రం వెండి మొక్కు జోడు, దర్బార్ సేవలో భక్తులు పాల్గొని తరించారు. పాతగుట్ట ఆలయంలో ఆర్జిత పూజలు ఘనంగా నిర్వహించారు. అన్ని విభాగాలు కలుపుకొని స్వామి వారి ఖజానాకు రూ.62,31,717 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ ఎన్.గీత, అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి తెలిపారు.

యాదగిరిగుట్ట ఆలయ మాఢవీధుల్లో భక్తుల సందడి

స్వామికి వెండి కలశాలు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామికి హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌కు చెందిన మహాలక్ష్మి గ్రూప్ కంపెనీ యాజమాన్యం బంగారు చెడీలు, వెండి కలశాలను బహూకరించింది. కంపెనీ చైర్మన్ ఈనకొండ చంద్రారెడ్డి, ప్రతినిధులు పురుషోత్తం, భాస్కర్, హర్షవర్ధన్ కలిసి రూ.5లక్షలతో తయారు చేసిన బంగారు చెడీలు, రూ.5లక్షలతో పశ్చిమ రాజగోపురానికి బంగారు తాడపంతో తయారు చేసిన దర్వాజలను సమర్పించారు. కంపెనీ చైర్మన్ ఈనకొండ చంద్రారెడ్డి, లక్ష్మి దంపతులు రూ.2 లక్షలతో 2కేజీల 5వెండి కలశాలను ఆలయ డీఈఓ దోర్భల భాస్కర్‌శర్మకు అందించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓలు గట్టు శ్రవణ్‌కుమార్, గజవెల్లి రఘు, సూపరింటెండెంట్ సురేందర్‌రెడ్డి, నాయకుడు కాంటేకార్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ ఎంజీయూ విద్యార్థి

రామగిరి, డిసెంబర్ 9 : సౌత్, వెస్ట్ జోన్ అంతర్ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ 54కేజీల విభాగంలో ఎంజీయూ విద్యార్థి తాటికొండ కార్తీక్ ప్రతిభ చాటాడు. ఏపీలోని రాజమండ్రిలో గల ఆదికవి నన్నయ్య యూనివర్సిటీలో నిర్వహించిన సౌత్‌జోన్ అంతర యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ 54కేజీల విభాగంలో కార్తీక్ ప్రథమ స్థానంలో నిలిచాడు. తాటికొండ కార్తీక్ ఎంజీయూ పరిధిలోని కోదాడ కేఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల చదువుతున్నారు. సౌత్‌జోన్‌లో విజయం సాధించడంతో జనవరి 24నుంచి 27వరకు జలంధర్‌లో గల ఏ లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ నిర్వహించే ఇంటర్ జోన్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు అర్హత సాధించినట్లు ఎంజీయూ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి జి.ఉపేందర్‌రెడ్డి తెలిపారు. కార్తీక్‌కు ఎంజీయూ స్పోర్ట్స్ బోర్డు అసిస్టెంట్ ప్రొఫెసర్ మురళి, శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో విజేతగా నిలిచిన కార్తీక్

వైభవంగా మరియగిరి మాత తిరునాళ్లు

రామగిరి, డిసెంబర్ 9 : నల్లగొండలోని దేవరకొండ రోడ్డులో మరియగుట్టపై గల మరియగిరి మాత తిరునాళ్లు శనివారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా మహా, ఘన సేవలు, ప్రార్థనలు చేశారు. తిరునాళ్లకు నల్లగొండతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఫాదర్స్ యేసు క్రీస్తు తెలిపిన సందేశాన్ని వివరించారు. వేడుకల్లో ఆంథోని, బాలశౌరిరెడ్డి, శౌరయ్య పాల్గొన్నారు.

రాజాపేటలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

అట్టహాసంగా రాష్ట్రస్థాయి క్రీడలు ప్రారంభం

- రాజాపేట మండలంలో మూడు రోజుల పాటు నిర్వహణ

రాజాపేట, డిసెంబర్ 9 : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మూడు రోజుల పాటు నిర్వహించే 9వ రాష్ట్ర స్థాయి క్రీడలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గురుకుల విద్యాలయాల సంస్థ జాయింట్ సెక్రటరీ బి.సక్రునాయక్ దీప ప్రజ్వలన చేసి క్రీడా పోటీలను ప్రారంభించారు. మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి జాతీయ ఒలంపిక్, సొసైటీ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. క్రీడా పోటీల్లో రాష్ట్ర స్థాయిలోని 8జోన్లకు సంబంధించిన 1,171మంది విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో సక్రునాయక్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. రాష్ట్ర స్థాయి క్రీడలను స్ఫూర్తిగా తీసుకోని జాతీయ, అంతర్జాతీయ స్థాయి స్థాయికి ఎదుగాలని సూచించారు. ఈ సందర్భంగా కబడ్డీ, వాలీబాల్, పుట్‌బాల్, బాల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, కార్యమ్స్‌తో పాటు చెస్ క్రీడా పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌డీసీ చైర్మన్ శ్రీమతి అనూరాధ, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ గోపగాని బాలమణీయాదగిరిగౌడ్, ఎంపీపీ గోపగాని బాలమణీయాదగిరిగౌడ్, సర్పంచ్ ఆడేపు ఈశ్వరమ్మశ్రీశైలం, జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారులు శ్రీమతి రజిని, శ్రీరామ్ శ్రీనివాస్, ఎస్.అరుణ, ఉదయ్ భాస్కర్, శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహాచారి, వార్డు సభ్యుడు జశ్వంత్ పాల్గొన్నారు.

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న గురుకుల విద్యాలయాల సంస్థ జాయింట్ సెక్రటరీ సక్రునాయక్